సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



అంజన్న దర్శనం.. భక్తుల పరవశం

శ్రావణ మాసం మూడవ శనివారోత్సవం సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి భక్తులతో పులకించిపోయింది. -8లో



బిల్లులు లేని బంగారం పట్టివేత

కడప నగరంలో బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న సుమారు కిలో 560 గ్రాముల బంగారాన్ని శనివారం పోలీసులు పట్టుకున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.8/27.6

వాతావరణం

జిల్లాలో శనివారం 27.6 - 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్స్, వైద్య విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ అవసరం. కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణంలో కళాశాల తరగతులలో సీసీ కెమెరాల వ్యవస్థ ఉండాలి. హాస్టల్, వర్క్ ప్రదేశాలలో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా ఉంచాలి.

– డాక్టర్ ఏ. సురేఖ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల, కడప

భద్రత కల్పించాలి



నైట్ డ్యూటీస్ చేసే వారు అభద్రతా భావంలో విధులను నిర్వహించాల్సిన పరిస్థితి రాకూడదు. డ్రెస్ ఛేంజింగ్ రూం, వాష్ రూమ్‌లు ప్రతి వైద్య సిబ్బందికి ఏర్పాటు చేయాలి. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాల వ్యవస్థను పెంచాలి. పోలీస్ పెట్రోలింగ్ ముఖ్యం.

- బి. వినీలా, స్టాఫ్ నర్స్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల(రిమ్స్), కడప

కఠిన చట్టాలు అవసరం



మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించేవారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు రూపొందించాలి. ఇటీవలి కాలంలో వైద్యులపై దాడులు జరుగుతున్నాయి. ప్రాణం పోస్తున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే ఎలా? కఠిన చట్టాలతో వేగంగా శిక్షలు పడాలి.

– సోఫిభాను, వైద్య విద్యార్థి

భద్రత కల్పించాలి



వైద్య వృత్తి చేస్తున్న వైద్యులకు భద్రత కల్పించాలి. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే సమయంలో పోలీసు బందోబస్తుతో పాటు పెట్రోలింగ్ చేయాలి. ఆస్పత్రి ప్రాంగణంలో పార్కింగ్ చేసే వాహనాలు, ఆటోలను నియంత్రించాలి. మద్యం మత్తులో ఉండే వారిని ఆస్పత్రిలోకి అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బంది చర్యలు చేపట్టాలి.

- నిహా, వైద్య విద్యార్థి

న్యూస్‌రీల్

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లుల చెల్లింపు

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 25, 26వ తేదీ సెలవు రోజుల్లోనూ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

న్యాక్ పీర్ టీం మెంబర్ కో-ఆర్డినేటర్‌గా బాయినేని



ఆచార్య బాయినేని శ్రీనివాసులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ టీంలో మెంబర్ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఈ టీం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లోని గవర్నమెంట్ సంజయ్ గాంధీ స్మృతి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలను ఈ నెల 28వ తేదీన సందర్శించనుంది. ఈ బృందంలో ప్రొఫెసర్ శ్రీనివాసులతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వైస్ ఛాన్సలర్ ,ప్రొఫెసర్లు ఉన్నారు. ఆచార్య బాయినేని శ్రీనివాసులు వైవీయూ ఎకనామిక్స్ విభాగాధిపతిగా, పలు రాష్ట్రాల విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్

బద్వేలు అర్బన్: అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మడకలవారిపల్లె సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ శేఖర్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె గ్రామపొలం సర్వేనెంబర్ 977/3 లో గల 2.34 ఎకరాలలో అనధికార నిర్మాణాలు జరుగుతున్నా వాటిని అడ్డుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సీసీఏ రూల్స్ 1991 మేరకు సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. విధినిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రకృతి సేద్యాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా



ప్రవీణ్‌కుమార్, డీపీఎం

కడప అగ్రికల్చర్: అందరి సహకారంతో జిల్లాలో ప్రకృతి సేద్యాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని ప్రకృతి సేద్యం డీపీఎం ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రకృతిసేద్యం కడప జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా నియమితులైన ప్రవీణ్‌కుమార్ శనివారం కడపలోని ప్రకృతిసేద్యం జిల్లా కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేశ్వరరావు

కడప అర్బన్: కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్‌గా కె.రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయనకు రాయలసీమ జైళ్లశాఖ డీఐజీగా అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. విజయనగరానికి చెందిన ఈయన 2007 బ్యాచ్‌లో గ్రూప్–1 అధికారిగా ఎంపికై జైళ్లశాఖ విధుల్లో చేరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జైళ్లలో అధికారిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు కేంద్ర కారాగారంలో విధులను నిర్వహిస్తూ కడప కేంద్ర కారాగారం అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైళ్ల శాఖ అభివృద్ధికి, ఖైదీల సంక్షేమం కోసం తమ వంతుగా కృషి చేస్తానని తెలియజేశారు.

కొల్లగొడుతున్నారు!



- పబ్బాపురం చెరువులో రెండు మిషన్లతో మట్టి తరలింపు
- శిబ్యాల గుట్టలను దోచేస్తున్న టీడీపీ నేతలు
- దువ్వూరు, మైదుకూరు నుంచి భారీ ఎత్తున అక్రమ రవాణా
- పచ్చ నేతల అక్రమార్జన కోసం లీజుదారులకు లభించని పర్మిట్లు



పబ్బాపురం చెరువు నుంచి లోడింగ్ చేస్తున్న మిషన్లు



శిబ్యాల గుట్టలో ఉన్న మిషన్, గ్రావెల్ తరలించిన ఆనవాళ్లు

సాక్షి ప్రతినిధి, కడప: 'పచ్చ'బిళ్లే పర్మిట్‌గా.. అధికారమే అండగా తెలుగుదేశం నాయకులు చెలరేగుతున్నారు. గ్రావెల్ మాఫియాగా మారి కొండల్ని..గుట్టల్ని గుల్ల చేస్తున్నారు. చెరువులను చెరబడుతున్నారు. ఊరువాడా తేడా లేకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. మైనింగ్ లీజుదారులకు పర్మిట్లు ఇవ్వకపోవడంతో అక్రమార్కులు విజృంభిస్తున్నారు. ఫలితంగా లక్షలాది రూపాయలు రాయల్టీ రూపేనా ప్రభుత్వానికి లభించాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది.

- ప్రధాన పట్టణాలకు చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారికంగా గ్రావెల్ మైనింగ్ లీజులున్నాయి. ప్రభుత్వం పర్మిట్లు విడుదల చేస్తే రాయల్టీ చెల్లించి గ్రావెల్ తరలించేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ లీజుదారులకు రాయల్టీ పర్మిట్లు అనుమతులు ఇవ్వలేదు. ఇదే ఆసరాగా టీడీపీ నేతలు విజృంభిస్తున్నారు. దువ్వూరు, మైదుకూరు, సంబేపల్లె, రాయచోటి, సుండుపల్లె, చింతకొమ్మదిన్నె ప్రాంతాల్లో భారీ ఎత్తున అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా దోచేస్తున్నారు.

శిబ్యాల గుట్ట గుల్ల....

రాయచోటి-సుండుపల్లె మార్గంలో శిబ్యాల గుట్టను గుల్ల చేస్తున్నారు. భారీ స్థాయి మిషన్లు పెట్టి ఇష్టానుసారంగా గ్రావెల్ దోపిడీకి పాల్పడుతున్నారు. రాయచోటి కేంద్రంగా భారీ స్థాయిలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు గ్రావెల్ తరలిస్తూ పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు సంబేపల్లె మండలం నుంచి కూడా గ్రావెల్ తరలిస్తున్నారు. ఎక్కడికక్కడ మైనింగ్ పాలసీ వచ్చే లోపు గ్రావెల్ ద్వారా సొమ్ము చేసుకోవాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.

- మైదుకూరు నియోజకవర్గంలో నీలాపురం గుట్ట, ముక్కొండ, గడ్డంవారిపల్లె, తిప్పిరెడ్డిపల్లె, క్రీస్తురాజాపురం గుట్ట నుంచి పెద్ద ఎత్తున గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారు. భారీస్థాయిలో అక్రమ రవాణాకు పాల్పడుతున్నా మైనింగ్ అధికారులకు కట్టడి చేయాలన్న ఆలోచనే లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అక్రమార్కులను కట్టడి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

క్రమం తప్పకుండా అక్రమ రవాణా...

రెండు నెలలుగా చింతకొమ్మదిన్నె మండలంలో క్రమం తప్పకుండా గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. తొలుత చింతకొమ్మదిన్నె చెరువులో మొదలుపెట్టిన 'తమ్ముళ్లు'తర్వాత కొలుములపల్లె పిచ్చమ్మ గుట్ట కేంద్రంగా అక్రమంగా మైనింగ్‌కు పాల్పడ్డారు. ఈ విషయం 'సాక్షి' బహిర్గతం చేయగానే పబ్బాపురం చెరువుకు మకాం మార్చారు. అక్కడి నుంచి టిప్పర్లతో రోజూ వందలాది ట్రిప్పులు తరలిస్తున్నారు. దాదాపు 8 అడుగుల మేర కీటు పెట్టి మట్టి తరలిస్తున్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారని పలువురు వాపోతున్నారు.



పబ్బాపురం నుంచి గ్రావెల్ మట్టి లోడింగ్ కోసం వేచి ఉన్న టిప్పర్లు

ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ

- 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారు అర్హులు
- ప్రీ రివిజన్ యాక్టివిటీ ప్రారంభం
- అక్టోబరు 18 వరకు ఇంటింటి పరిశీలన



కడప సెవెన్‌రోడ్స్: ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం-2025ను చేపట్టాలని భారత ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 అర్హత తేదీగా నిర్ణయిస్తూ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో జిల్లాలో ప్రీ రివిజన్ యాక్టివిటీ ప్రారంభమైంది. బీఎల్‌ఓల నియామకం చేపట్టాల్సి ఉంటుంది. అంగన్వాడీ వర్కర్ల స్థానంలో గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగులను బీఎల్‌ఓలుగా నియమించాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ మేరకు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, ఏఈఆర్‌ఓలతోపాటు బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బీఎల్‌ఓల ఇంటింటి పరిశీలన షెడ్యూల్ ప్రకారం ఈనెల 21 నుంచి ప్రారంభమైంది. అక్టోబరు 18వ తేదీ వరకు జరిగే ఇంటింటి పరిశీలనలో బీఎల్‌ఓల వెంట గ్రామ, వార్డు వలంటీర్లు వెళ్లరాదని ఈసీఐ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఈసీఐ నిర్ణయించిన మూడు అర్హత తేదీల్లో 18 ఏళ్లు నిండే వారిని బీఎల్‌ఓలు గుర్తించాలి. ఒకే వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో రెండు, మూడు చోట్ల ఉన్న విషయాన్ని, చనిపోయిన వారి వివరాలు, శాశ్వతంగా ఒక ప్రాంతం నుంచి వెళ్లిపోయిన వారి పేర్లను బీఎల్‌ఓలు తమ ఇంటింటి పరిశీలనలో గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలి. ఓటర్ల జాబితాలో డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ , ఫొటో సిమిలర్ ఎంట్రీస్ లను గుర్తించాలి.

అక్టోబర్ 18కి పూర్తి చేయాలి..

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను వంద శాతం సందర్శించడంతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1500కు మించకుండా ఉండాలి. పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్ల దూరం పైబడి ఉండరాదు. ఇలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ స్పెషల్ సమ్మరీ రివిజన్‌గా పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 18 నాటికి ఈ కార్యక్రమం పూర్తి కావాలని ఈసీఐ ఆదేశించింది. అక్టోబరు 19 నుంచి 28వ తేది వరకు ఫార్మెట్-1 నుంచి 8 వరకు సిద్ధం చేయాలి. అలాగే ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 29వ తేదీ సమగ్ర ఓటర్ల ముసా యిదా జాబితాను జిల్లా ఎన్నికల అధికారి విడుదల చేస్తారు. ఆరోజు నుంచి నవంబరు 28 వరకుఅభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 24వ తేది నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి కావాలి. 2025 జనవరి 6వ తేది ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నారు.

రెండోదశ డిగ్రీ ప్రవేశాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

వైవీయూ: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం రెండో దశ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో కళాశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారన్నారు. రెండోదశలో సైతం పెద్దసంఖ్యలో విద్యార్థులు చేరనున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఉచితంగా చేయిస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, అధ్యాపకులు టి. హజరతయ్య, రాజీవ్‌బాబు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో జిల్లాలో పేదలకు గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హౌసింగ్ పనుల పురోగతిపై హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసి జిల్లాలోని హౌసింగ్ డీఈలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఇంజనీరింగ్ అసిస్టంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంటి నిర్మాణాల ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాల్లో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీకి లోబడి ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. కొత్తగా హౌసింగ్ పథకంలో లబ్ధిదారులకు అక్టోబర్ 2 నుంచి ప్రారంభం అయ్యే నూతన గృహ నిర్మాణ ప్రక్రియలో తప్పకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. నీటిని భవిష్యతరాలకు కూడా అందేలా పొదుపు చేసుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ప్రస్తుతం వివిధ దశల్లో జరుగుతున్న నిర్మాణ పనులను సంబందిత క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, డ్వామా పీడీ జోయల్ విజయ్ కుమార్, కడప నగర కమీషనర్ వై.ఓ. నందన్, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఏఈ లు, డీఈలు, ఏపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

- కార్యకర్తలే పార్టీకి వెన్నెముక... వారికి సముచిత స్థానం కల్పిస్తాం
- వైఎస్సార్‌సీపీ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
- అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కడప కార్పొరేషన్: జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేలా పనిచేస్తామని ఆ పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా రవీంద్రనాథ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అంతకుముందు పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి నేతలంతా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలను ఎండగడుతామని, ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముకలాంటి వారని, అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని రాబోయే ఎన్నికల్లో 7 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి కానుకగా ఇస్తామని తెలిపారు.

పార్టీని బలోపేతం చేస్తాం: ఆకేపాటి

వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తామని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. తనకు జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

పార్టీ కార్యకర్తల భద్రత, ఆత్మ గౌరవాన్ని కాపాడటమే ప్రధాన ఎజెండాగా పార్టీ అధ్యక్షులు పనిచేయాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవింద రెడ్డి, ఎంవీ రామచంద్రా రెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలకు అన్యాయం జరిగిన విషయాన్ని అంగీకరిస్తున్నామని, ఇప్పటి నుంచి వారికి ఏ చిన్న హాని జరిగినా వెంట ఉంటామని స్పష్టం చేశారు. మాజీ ప్రభుత్వ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి తదితరులు ప్రసంగించారు.

వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా: కమలాపురం ఇన్‌చార్జి నరేన్

తనను కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకొని వచ్చే ఎన్నికల్లో కమలాపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు.

సర్వమత ప్రార్థనలతో బాధ్యతల స్వీకరణ

వైఎస్సార్ సీపీ జిలా అధ్యక్షుడిగా పి. రవీంద్రనాథ్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మతపెద్దలు సర్వమత ప్రార్థ నలు చేసి ఆశీర్వదించారు. నేతలు గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, జి. జయచంద్రారెడ్డి, పాకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.



భద్రత కల్పించాలి



వైద్య చదువులు చదివే వృత్తికి వెళితే పిల్లలు భద్రంగా ఉంటారని తల్లిదండ్రులు ఆలోచిస్తారు. అయితే ఆస్పత్రిలో కూడా రక్షణ లేదని, అక్కడ కూడా మానవ మృగాలు దాడి చేస్తాయని కోల్‌కతా ఘటనతో ఆస్పత్రిలోని డొల్లతనం బయటపడింది. ముందుగా మాకు రక్షణ కావాలి. భద్రత కల్పించాలి. కష్టపడి పని చేస్తాం.. కానీ ప్రశాంత వాతావరణం కల్పించాలి. – షేక్ సమీన హసీనా, వైద్య విద్యార్థి, ఫాతిమా వైద్య కళాశాల, కడప, వైఎస్సార్ జిల్లా

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



ప్రాణం పోసే వృత్తి వైద్యులది. అలాంటి వైద్యులను అమానుషంగా, రాక్షసంగా బలి తీసుకుంటున్నారు. కోల్‌కతా సంఘటన మానవత్వానికి మచ్చ వంటిది. ఈ సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలు చేయాలి.

– డాక్టర్ మాచనూరు శృతి, మైదుకూరు, వైఎస్సార్ జిల్లా

కఠినంగా శిక్షించాలి



కోల్‌కత్తాలో జరిగిన ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు ప్రత్యేక రక్ష ణ చట్టం కల్పించాలి. వైద్యులపై నేరాలకు పాల్పడే వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవరించి శిక్షించేలా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఎం.నాగవేణి, ప్రభుత్వాస్పత్రి, పీలేరు, అన్నమయ్య జిల్లా

వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే వైద్యులపై దాడులకు దిగిన, అఘాయిత్యాలకు పాల్పడిన నేరస్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ నెల 9న కోల్‌కోత్తాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, పైశాచికంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి వైద్యుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

– డాక్టర్ బి.ఈశ్వరసురేంద్ర, ప్రభుత్వాస్పత్రి, పీలేరు, అన్నమయ్య జిల్లా

గండి ఆలయ సిబ్బందికి ప్రమాదం

– ఆసుపత్రికి జూనియర్ అసిస్టెంట్ తరలింపు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మారెన్న విధి నిర్వహణలో ప్రమాదానికి గురయ్యాడు. శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా లడ్డూ ప్రసాద కేంద్రంలో ఆలయ అధికారి లడ్డూ ప్రసాదాల బాధ్యతలు అప్పగించాడు. విధి నిర్వహణలో భాగంగా ఆయన లడ్డూ టికెట్ కౌంటర్ వద్ద నిల్వ ఉన్న ప్రసాదాలను విక్రయ కేంద్రంలోనికి తరలిస్తుండగా.. అక్కడే ఉన్న దిమ్మెపై పడ్డాడు. దీంతో అక్కడే ఉన్న భక్తులు ఆలయ సిబ్బంది గుర్తించి వెంటనే పైకి లేపారు. అయినా అతడు నేచి నిలబడి నడవగల స్థితిలో లేక పోవడంతో ఆలయ సూపరింటెండెంట్ షరీఫ్ ఆలయ అధికారి వెంకట సుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలకు సమాచారం అందించారు. వెంటనే అక్కడే ఉన్న వైద్యశిబిరంలో ప్రథమ చికిత్స చేయించి 108 వాహనంలో వేంపల్లెకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కడపకు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



రమణయ్య (ఫైల్)

అట్లూరు : మండల పరిధిలోని కొండూరు బీసీ కాలనీకి చెందిన బత్తల రమణయ్య (50) శుక్రవారం సాయంత్రం రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడి బంధువుల వివరాల మేరకు.. రమణయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించే వాడు. ఎక్కడ పనులు ఉంటే అక్కడికి వెళ్లే వాడు. అందులో భాగంగా శుక్రవారం తిరుపతిలో కొన్ని రోజుల పాటు పని ఉందని, అక్కడికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరాడు. సాయంత్రం సిద్దవటం మండలం కనుమలోపల్లి రైల్వేస్టేషన్‌లో తిరుపతికి వెళ్లేందుకు రైలు కోసం వేచి ఉన్నానని ఇంటికి సమాచారం ఇచ్చాడు. అయితే రాత్రికి రైలు కింద పడి మృతి చెందాడని సమాచారం అందింది. శనివారం కడప రిమ్స్‌లో పోస్టుమార్టం ముగించుకుని మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ..

ముద్దనూరు : ఈ నెల 22వ తేదీన బైక్‌పై నుంచి కింద పడి గాయపడిన రామలక్షుమ్మ (51) అనే మహిళ మృతి చెందింది. జమ్మలమడుగుకు చెందిన రామలక్షుమ్మ యర్రగుంట్లలో తన సోదరికి అనారోగ్యంగా వుండడంతో పరామర్శించడానికి 22వ తేదీన వెళ్లింది. ఆమె కుమారుడి బైక్‌లో వెనుక కూర్చుని తిరిగి యర్రగుంట్ల నుంచి జమ్మలమడుగుకు బయలుదేరింది. ముద్దనూరులోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం దాటిన తర్వాత వెనుక కూర్చున్న రామలక్షుమ్మ చీర బైక్ చక్రంలో ఇరుక్కుని ఆమె కింద పడి కొంత దూరం జారుకుంటూ వెళ్లింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో మరణించింది.

వినాయక ఉత్సవాలకు
పందిళ్ల సందడి

- కూడళ్లకు తరలుతున్న విగ్రహాలు
- నిబంధనలు పాటించాలని పోలీసు శాఖ సూచన

కడప కల్చరల్ : రెండు వారాల తర్వాత వినాయక చవితి పండుగ నిర్వహించుకోనున్నాం. ఈ పండుగ అంటే పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహం. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పందిళ్లలో స్వామి వద్ద పూజలు, ఆధ్యాత్మిక చింతనతో ఆనందంగా గడిపే అవకాశం లభిస్తుండటంతో పెద్దలతోపాటు యువత కూడా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. కడప నగరంలో భారీ పందిళ్ల నిర్మాణం మొదలైంది. పండుగ సమీపిస్తూ ఉండటంతో ప్రధాన రోడ్లపైనే కాక వీధి కూడళ్లు, సందు గొందుల్లో కూడా చవితి పందిళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. కొన్నిచోట్ల పందిళ్ల నిర్మాణం ఓ దశకు చేరుకుంటూ ఉండగా, మరికొన్ని చోట్ల అవసరమైన సరంజామాను పందిరి ఏర్పాటు చేయనున్న స్థలం వద్ద సిద్ధం చేసి ఉంచారు. కడప నగరంలోని ఎన్జీఓ కాలనీలో అత్యంత భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం వారం రోజుల క్రితమే పందిరి నిర్మాణాన్ని ప్రారంభించారు. దీంతో పాటు కో ఆపరేటివ్ కాలనీలో కూడా పందిళ్ల నిర్మాణం సాగుతోంది. ఇదికాకుండా మద్రాసు రోడ్డుతోపాటు నగరంలోని దాదాపు అన్ని కూడళ్లలో పందిళ్ల నిర్మాణం ప్రారంభమైంది. మరికొన్ని చోట్ల పెద్ద విగ్రహాలను ముందే తీసుకొచ్చి కూడళ్లలో ఏర్పాటు చేయనున్న వేదికల వద్ద సిద్ధంగా ఉంచారు. ఈసారి పండుగ చాలా సందడిగా జరిగే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండడంతో నగరం వెలుపల పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాల తయారీ భారీ స్థాయిలో సాగుతోంది. ఈ పరిస్థితి జిల్లా అంతటా ఉంది. పెద్ద, చిన్న తేడా లేకుండా గ్రామాల స్థాయి నుంచి మండలాలు, పట్టణాల స్థాయి వరకు పందిళ్లకు తరలేందుకు రంగురంగుల గణపతి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి.



కో ఆపరేటివ్ కాలనీలో పందిరి నిర్మాణంలో కార్మికులు



కడప నగరం ఎన్జీఓ కాలనీలో నిర్మాణంలో చవితి పందిరి

అనుమతి పొందాలి

పందిళ్ల ఏర్పాటు చేసుకోదలిచిన వారు తమ పరిధిలోని పోలీసుస్టేషన్‌లో దరఖాస్తు సమర్పించాల్సి ఉంది. అనంతరం డీఎస్పీ అనుమతి పొందాలి. రాత్రి సమయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవారు.. వాటి కోసం ప్రత్యేకంగా అనుమతులు తీసుకుని పోలీసుల సూచన మేరకు చలానా ద్వారా నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పోలీసులు ఈ విషయంగా ఉత్సవ కమిటీ సభ్యులకు పలు సూచనలు జారీ చేయడంతో అనుమతులు లభించిన ప్రదేశాల్లో పందిళ్ల నిర్మాణం ప్రారంభమైంది. యువత రూల్స్‌కు అనుగుణంగా ఉత్సాహంగా పందిళ్లను ఏర్పాటు చేయడంలో మునిగిపోయారు. పండుగను పూర్తి స్థాయిలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని పోలీసులు సూచించడమే కాక దాదాపు అన్ని పందిళ్లు సీసీ కెమెరాల పరిధిలోకి వచ్చే ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు కూడా నిమజ్జనం పూర్తయేంత వరకు ఉంటుంది. పండుగ మనకు ఆనందాన్ని ఇవ్వడంతోపాటు ఇతరులకు ఏమాత్రం ఇబ్బందులు కలిగించకూడదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పండుగ ఆనందాన్ని ఆస్వాదిద్దాం!

ఇలా జరుపుకుందాం..

పండుగను పూర్తి సంప్రదాయబద్ధగా, భక్తితో నిర్వహించుకోవాలని, ఆధునిక పోకడల పేరుతో విచ్చలవిడి తనం మంచిది కాదని పెద్దలు సూచిస్తున్నారు. దైవానికి చేసే పూజ గనుక తగిన పవిత్రతను పాటించాలని సూచిస్తున్నారు. బూట్లు, చెప్పులు వేసుకొని రాకూడదు. శాస్త్రంలో సూచించిన విధంగానే విగ్రహాలు ఉండాలి. పైగా దేవుళ్లను ఎగతాళి చేసినట్లు అవుతుంది. పెద్ద శబ్దాలు చేసేలా మైకులు పెట్టకూడదు. నిమజ్జనం రోజున మద్యం సేవించడం, అల్లరి చేయడం, తెలియని వారికి రంగులు పూయడం మంచిది కాదు. కాలక్షేపం కోసం పందిళ్లను వాడుకోకూడదు. ఇతర మతాల ప్రార్థన సమయాలను గౌరవించాలి. వారి మత సంప్రదాయాలను కించపరచకూడదు. పూర్తి భక్తితో పందిళ్లను నిర్వహించకుంటే పూజల కోసం వెళ్ల వద్దని పురోహిత సంఘాలు తన సభ్యులకు సూచిస్తూ ఉండటం మంచి పరిణామం.

పోలీసుల సూచనలు

పందిళ్ల వద్ద రాత్రిళ్లు బాధ్యత గల భక్తుడైన కమిటీ సభ్యుడు కాపలా ఉండాలి. విలువైన విగ్రహాల బాధ్యత కమిటీయే తీసుకోవాలి. పందిళ్లలోకి మద్యం సేవించి రాకూడదు. వాహనాలు పందిళ్లకు దూరంగా ఉంచాలి. పందిళ్ల సమీపంలో ద్విచక్రవాహనాల అతివేగం కూడదు. ప్రతి అంశాన్ని సీసీ కెమెరాల్లో రికార్డు చేస్తారు. భక్తి కార్యక్రమాలు తప్ప అల్లరి పాటలు, డ్యాన్స్‌లు చేయకూడదు.

26 నుంచి క్రీడా దినోత్సవ వేడుకలు

కడప స్పోర్ట్స్ : హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు జిల్లాలోని క్రీడాసంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంఘాల నుంచి సూచనలు/ప్రణాళికలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారుల వివరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవంలో జిల్లా అధికారులు, ఉద్యోగులు అందరినీ క్రీడార్యాలీలో భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు, క్రీడాకారులు అందరూ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు ఎస్.వి.పి. అమృత్‌రాజ్, ఫుట్‌బాల్ కోచ్ సెల్‌నెంబర్ 6300664935, అబ్దుల్ మునాఫ్, హ్యాండ్‌బాల్ కోచ్ సెల్ నెం: 9502217522 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. దిగువ తెలిపిన క్రీడాపోటీలు కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాల వివరాలు

27-08-23 : ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను క్రీడలు నిర్వహించు సంస్థలు, క్రీడక్లబ్‌లు, అసోసియేషన్‌లు, క్రీడల్లో పాల్గొను ప్రతి ఒక్కరూ వారి కార్యాలయాల్లో నిర్వహించాలి.

27-08-24 : (18 నుంచి 40 ఏళ్ల వయసు వారికి) 100 మీ.పరుగు, బస్కవాక్, వాలీబాల్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్.

(40 నుంచి 60 ఏళ్ల వారికి) 50 మీ. పరుగు, 300 మీ.వాక్, టగ్ ఆఫ్ వార్, షటిల్ బ్యాడ్మింటన్, 60 ప్లస్ గ్రూపు వారికి 30-50 మీటర్ల వాక్, యోగా.

28-08-24 : అవుట్‌డోర్ గేమ్స్: వాక్/రేస్, వాలీబాల్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్.

ఇండోర్ గేమ్స్ : షటిల్ బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నిస్.

ఫన్ గేమ్స్ : లెమన్ రేస్/సాక్‌రేస్, రోప్ జంపింగ్, ఖోఖో, లగోరి, లంగాడి, ప్లాంక్ చాలెంజ్

29-08-24 : ర్యాలీ ఉదయం 7 గంటలకు కోటిరెడ్డి సర్కిల్ నుంచి డీఎస్‌ఏ స్టేడియం వరకు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు డీఎస్‌ఏ స్టేడియంలో సన్మాన కార్యక్రమం.

30-08-24 మరియు 31-08-24 : పైన నిర్వహించిన కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను శాప్, సోషల్ మీడియాలో పొందుపరుచుట.

అండర్-23 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం క్రీడా మైదానాలు వేదికగా ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో చిత్తూరు జట్టు 5 వికెట్ల నష్టానికి 395 పరుగులు చేసింది. జట్టులోని వై.తేజారెడ్డి 136 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్‌లతో 122 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ధరణికుమార్ నాయుడు 60, నిఖిత్ 60 పరుగులు చేశారు. కడప బౌలర్లు ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 62 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని ఎ.సాయిసూర్య తేజారెడ్డి 85 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్‌లతో 92 పరుగులు చేశాడు. ఈయనకు జతగా నయీముల్లా 54 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 3, మాధవ్ 2, నారాయణ 2, భార్గవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. జట్టులోని భార్గవ్ 23, ఫర్హద్ ఖాద్రి 18 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

బిల్లులు లేని బంగారం పట్టివేత

కడప అర్బన్ : కడపలో బిల్లులు లేకుండా బంగారం తీసుకెళుతుండగా శనివారం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జి సబ్‌డివిజనల్ అధికారి, అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు ఉత్తర్వుల మేరకు శనివారం ఉదయం 6 గంటలకు కడప వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డికి సమాచారం వచ్చింది. ఈ మేరకు సీఐతోపాటు ఎస్‌ఐ జి.అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి రెండో గాంధీబొమ్మ సమీపంలో తనిఖీలు చేశారు. కడప నగరం బీకేఎం స్ట్రీట్‌కు చెందిన దేశ్‌ముఖ్ భరత్‌రాజారామ్ తీసుకెళుతున్న బ్యాగ్‌ను పెద్దమనుషుల సమక్షంలో సోదా చేశారు. ఆ బ్యాగ్‌లో సుమారు కిలో 560 గ్రాముల బరువు గల బంగారు బిస్కెట్లు, బంగారు కడ్డీలు ఉన్నాయి. ఈ బంగారానికి సంబంధించిన బిల్లులను పోలీసులు ప్రశ్నించగా.. తన దగ్గర ఎలాంటి బిల్లులు లేవని, జి.ఎస్.టి కట్టకుండా వ్యాపారం చేస్తున్నానని తెలియజేశారు.



బంగారం సీజ్ చేసిన విషయంపై నోటీసును దేశ్‌ముఖ్ భరత్ రాజారామ్‌కు ఇస్తున్న సీఐ

దేశ్‌ముఖ్ భరత్ రాజరావ్ బంగారంను బిల్లులు లేకుండా, జీఎస్‌టీ కట్టకుండా బ్లాక్‌లో విక్రయిస్తుండగా పంచనామా ద్వారా స్వాధీనం చేసుకుని తదుపరి చర్య నిమిత్తం తిరుపతి ఇన్‌కం ట్యాక్స్ వారికి నివేదిక ద్వారా అప్పగించినట్లు సీఐ తెలియజేశారు.

అంజన్న దర్శనం.. భక్తజన పరవశం

గండి క్షేత్రంలో కిక్కిరిసిన క్యూలైన్లు



గండి క్షేత్రంలో భారీగా భక్తజనం

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి శ్రావణ మాసం మూడవ శనివారోత్సవం సందర్భంగా భక్తులతో పులకించిపోయింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామిని దర్శించుకొని పరవశించి పోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు భక్తులతో నిండుగా కనిపించాయి. స్వామి దర్శనం కోసం సుమారు 3 గంటల పాటు క్యూలైన్లలో వేచి ఉండి దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని పోలీసులు అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే నిలిపివేశారు. దీంతో భక్తులు కాలినడకన గండికి చేరుకొని దర్శించుకున్నారు. వృద్ధులు, మహిళల కోసం వేంపల్లె ప్రైవేట్ పాఠశాలల వారు ఉచితంగా వ్యాన్‌లు ఏర్పాటు చేశారు. కొందరు భక్తులైతే వేంపల్లె, చక్రాయపేట, నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల కోసం దాతలు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. ట్రిపుల్ ఐటీ, వేంపల్లె, పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తమ సేవలను అందించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు పాలక మండలి సభ్యులతోపాటు, ఆర్కేవ్యాలీ సీఐ నాగరాజు, ఆర్కేవ్యాలీ ఎస్సై భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 270 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజ గోపాలాచార్యులు, రఘుస్వామి, వేదపారాయణం రామమోహనశర్మలు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. చక్రాయపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కడప సర్వజన ఆసుపత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రిపుల్ ఐటీ ప్రసాద్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చకపోతే ఆత్మహత్యే శరణ్యం

- మూడు నెలలవుతున్నా పట్టించుకోని విద్యుత్ అధికారులు
- రజక సామాజిక వర్గానికి చెందిన రైతుల ఆవేదన

బ్రహ్మంగారిమఠం : ట్రాన్స్‌ఫార్మర్ మార్చకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని రజక సామాజిక వర్గానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మల్లేపల్లె పంచాయతీ చెంచయ్యగారిపల్లె గ్రామానికి చెందిన రజక కుల మహిళా రైతు పొంగూరు పుల్లమ్మ వ్యవసాయ పొలం సర్వీస్ నెంబర్ 35కు ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. వ్యవసాయ పొలానికి ట్రాన్స్‌ఫార్మర్ చాలా దూరంగా ఉండడంతో కరెంట్ సరిగా రాలేదని బి మఠం ఏఈఈకి 11-03-2024న ఆమె రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలి అంటే షిఫ్టింగ్ చార్జి చెల్లించాలి అన్నారు. మహిళా రైతు కుమారుడు 13-3-2024న రూ.50లు షిఫ్టింగ్ చార్జి చెల్లించాడు. అనంతరం వైరు, పోల్స్ మార్పుకోసం రూ.10162 చెల్లించారు. మరొక సర్వీస్ ఉండాలని తెలపడంతో పొంగూరు రమణయ్య పేరుతో చేయించారు. అయినా దాదాపు మూడు నెలలు దాటినా ఇంత వరకు ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేదని మహిళా రైతు, నరసమ్మ, రమణలు వాపోతున్నారు. వ్యవసాయం చేసుకొనే సమయం వచ్చిందని అధికారుల చుట్టూ తిరుగుతున్నా రాజకీయంగా అడ్డు తగులుతున్నారు. యాదవులు ఆదిబోయిన గురువయ్య ఉరఫ్ జుట్టు నాగన్నగారి గురయ్య అడ్డుకుంటున్నారని నరసమ్మ కుమారుడు రమణయ్య తెలిపారు. తాము రజకులస్తులమని అడ్డుకుంటున్నారని, తాము వ్యవసాయం చేయకూడదా అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపక పోతే మా చావులకు విద్యుత్ అధికారులే బాధ్యులు అవుతారని తెలిపారు.

మహిళల హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ ఆవరణలో వున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆవరణలో మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181లపై అవగాహన పెంచేందుకు విద్యార్థినులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ హేమగిరి కుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్ప్‌లైన్ నెంబర్లు 1098, 181లపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఇందులో భాగంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తోపాటు లెక్చరర్ నిర్మల, ఎన్‌సీసీ ఇన్‌చార్జి మాబుచాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. ఎస్.ఆర్షియ, టి.తేజస్విని, కె.ఆయేషాలు వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల కక్ష సాధింపు చర్య

- పాఠశాల కమిటీ ఎన్నికల్లో ఓటు వేయలేదని..
- ఓ వ్యక్తిపై కేసు నమోదయ్యేలా ఒత్తిడి

కలసపాడు : మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన ఎద్దుల ధర్మరాజు ఇటీవల జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో తమ పార్టీ సానుభూతి పరుడికి ఓటు వేయలేదని టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మరాజు శనివారం తన ఇంటి వద్ద తన ట్రాక్టర్‌తో రెండు ట్రిప్పులు మట్టిని తోలుకున్నాడు. ఈ విషయంపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దారు విచారణ చేయకుండా ధర్మరాజుపై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేయాలని ఎస్‌ఐని ఆదేశించారు. వాస్తవంగా అయితే మూడు రోజుల నుంచి రెవెన్యూ అధికారుల కనుసన్నల్లో కాశినాయన మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన ఓ యజమానికి చెందిన జేసీబీతో, 5 ట్రాక్టర్లతో కొందరు మట్టిని తోలుకుంటున్నారు. ఈ క్రమంలో ధర్మరాజు తన ఇంటి వద్ద ఉన్న గుంతలను పూడ్చేందుకు అదే జేసీబీ వద్ద రెండు ట్రిప్పులు మట్టి తోలుకున్నాడు. గత వారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో ఓటు వేయలేదనే కారణంతో కక్ష సాధింపు చర్యకు దిగారని ధర్మరాజు తెలిపారు. టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండానే వందల ట్రిప్పుల మట్టిని యథేచ్ఛగా తోలుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కేవలం తన ఇంటి వద్ద మురికినీరు ఉండటంతో పిల్లలు అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు రెండు ట్రిప్పుల మట్టి తోలుకున్నానని పేర్కొన్నారు. ఇందుకు తనపై చర్య తీసుకోవడం సమంజసం కాదని, జేసీబీ యజమాని, ఇతర ట్రాక్టర్ల యజమానులపై కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు మహబూబ్‌బాషాను వివరణ కోరగా ధర్మరాజుపై అభియోగాలు వచ్చాయని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కౌన్సిలర్‌కు రేషన్ బియ్యంతో సంబంధం లేదు

నిందితుడు నక్కా రామకృష్ణ

ప్రొద్దుటూరు : మూడో వార్డు టీడీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మికి అక్రమ రేషన్ బియ్యంతో సంబంధం లేదని నిందితుడు నక్కా రామకృష్ణ తెలిపారు. టీడీపీ కౌన్సిలర్ ఇంటి పక్కన నివసిస్తున్న నక్కా రామకృష్ణ ఇంటిలో 33 బస్తాల అక్రమ రేషన్ బియ్యం నిల్వ ఉన్నాయని రెవెన్యూ అధికారులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. రామకృష్ణ శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎండీయూ వాహనదారుడు చైతన్య తనకు ఇవ్వాల్సిన బాకీలోకి రేషన్ బియ్యం తనకు ఇచ్చాడని తెలిపారు. తనకు గేదెలు, కోళ్లు ఉన్నాయని, వాటి కోసం బియ్యం తీసుకున్నానన్నారు. ఈ బియ్యంతో టీడీపీ కౌన్సిలర్‌కు ఎలాంటి సంబంధం లేదని, అనవసరంగా ఆమెపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కౌన్సిలర్ ఇంటి పక్కన ఉండటమే తాను చేసిన నేరమా అని ఆయన అన్నారు. పట్టణంలో బియ్యం వేసే వాహనదారులు బహిరంగంగా బియ్యం వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు.